# తెర

''డాక్టర్... మీకు ఫోన్''

సిస్టర్ అందించిన ఫోన్ అందుకని ''హలో... రేవతి హియర్'' అన్నది డాక్టర్ రేవతి.

''హలో రేవతీ... మనూ హియర్''

''మనోహర్... చెప్పు- ఏమిటి విశేషాలు?''

''ఇప్పుడు టైమెంతో తెలుసా!''

''ఎంత!'' రేవతి కుర్చీలో రిలాక్స్డ్‌గా వెనక్కివాలుతూ, చిరునవ్వు పెదాలపైన లాస్యంచేస్తోంటే అడిగింది.

''వాచ్‌లేదా!'' చిరుకోపంగా అన్నాడు మనోహర్.

రేవతికి నవ్వొచ్చింది.

''ఇప్పుడే ఎమర్జెన్సీ కేస్ అటెండ్ అయివచ్చాను. సిజేరియన్. అలసిపోయానుకదా కాసేపు కూర్చుని బయలుదేర్దామని అనుకుంటుండగా నీ ఫోన్ వచ్చింది''

''ఏమో - నాకేం నచ్చలేదు నీ పద్ధతి. ఇంటి దగ్గర దీప్తి ఒక్కతే నీకోసం ఎదురుచూస్తుంటుందనే జ్ఞానం నీకుంటే బాగుంటుంది''

మనోహర్‌కి బాగా కోపం వచ్చిందని గ్రహించింది. నిజమే... ఇంటి దగ్గర దీప్తి ఒక్కతే తన కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. కానీ ఏంచేయగలదు? వృత్తికి అంకితం చేసుకున్నాక తప్పుతుందా?

మనోహర్ తన శ్రేయోభిలాషి. తనని మందలించే హక్కు అతనికుంది. అందుకే అతని మాటలకి కోపం రాలేదు.

''సారీ మనూ... వృత్తిధర్మం విస్మరించటం న్యాయంకాదు కదా?'' అన్నది.

''నేను ధర్మాలు, ఉపనిషత్తులు వినడానికి ఫోన్ చేయలేదు. నీకిచ్చిన గడువు దాటి రెండు నెలలయింది. నీ సమాధానం కోసం ఆశచావక చేశాను''

''...''

''రేవతీ''

''ఊ...''

''ఐదు సంవత్సరాలనుంచీ ఈ ప్రశ్నకి సమాధానం లేదు''

''...''

''రేవతీ... ప్లీజ్ - మాట్లాడు నాకింక ఓపిక లేదు. నీ సమాధానం పైనే నా భవిష్యత్తు నిర్ణయించుకోవాలి. నువ్వు కాదంటే నేనిక్కడ ఉండి ప్రయోజనం లేదు... స్టేట్స్‌లో సెటిలవ్వాలనుకొంటున్నాను... చెప్పు రేవతి''

''మనూ... రేపు మాట్లాడదాం'' మనోహర్ మాటలకి ఎలాగో అయిపోయిన రేవతి నీరసంగా అంది.

''సరే - రేపు నాకు ఏదో ఒకటి చెప్తావని ఆశిస్తున్నాను. ఓకే''

''ఆఁ ...గుడ్‌నైట్...''

''గుడ్‌నైట్...''

రేవతి ఫోన్‌క్రెడిల్ మీద ఉంచి సన్నగా నిట్టూర్చింది.

సిస్టర్‌ని పిలిచి ఏదన్నా అవసరంవస్తే ఇంటికి ఫోన్‌చేయమని చెప్పి బైటికెళ్ళి కారులో కూర్చుంది.

ఇల్లు చేరిన రేవతి నీరసంగా మంచంమీద వాలిపోయింది. ఆరోజు బాగా అలసిపోయింది - మెంటల్‌గా, ఫిజికల్‌గా కూడా. నిస్త్రాణగా ఉంది. హాయిగా కళ్ళు మూసుకుని పడుకోవాలని ఉంది.

''మమ్మీ! పడుకున్నావేం? త్వరగా స్నానం చేసి వస్తే భోజనం వడ్డిస్తాను. నీకిష్టమైన కూర - కాకరకాయ'' దీప్తి సుడిగాలిలా వచ్చి లేపేసింది.

''నువ్వు పడుకోలేదా? ఎన్నిసార్లు చెప్పినా ఎందుకింత రాత్రివరకూ మెలకువగా ఉంటావు? వంటమనిషి ఉందికదా''

''నో మమ్మీ... ఇది మాత్రం నువ్వు అభ్యంతర పెట్టకూడదు. ఇంత కష్టపడి రాత్రీ పగలూ రోగులకు సేవచేసి, అలసిసొలసి వచ్చే నీకు ఈ మాత్రం కూడా సేవచేయవద్దా?''

రేవతి మనసు పులకించింది.

తన చీకటి జీవితంలో దీప్తి ఒక వెలుగు రేఖ. ఆమె చిరునవ్వే లేకపోతే తనకింత మనోబలం, బతకాలనే ఆశ ఎలా కలుగుతాయి! దూరంగా, సముద్రాలకవతల పరాయి దేశంలో చదువుకుంటున్న నిఖిల్ ఉత్తరాల ద్వారా అంతో ఇంతో మనశ్శాంతినందిస్తున్నాడు. దీప్తి కంటిపాపలా తనని అహర్నిశలూ అంటిపెట్టుకుని ఉంటూ మనశ్శాంతినిస్తోంది. వీళ్ళిద్దరే లేకపోతే భవిష్యత్తు ఎంత భయంకరంగా పరిణమించేది.

రేవతి, దీప్తి బలవంతం మీద లేచి బాత్రూమ్ వైపు నడిచింది.

ఆమె స్నానం ముగించి వచ్చేటప్పటికి దీప్తి డైనింగ్ టేబిల్ మీద అన్నీ రెడీగా ఉంచింది.

''మమ్మీ... అన్నయ్య 'లెటర్ రాశాడు. వచ్చే నెలలో వస్తాట్ట. లెటర్ నీరూమ్‌లో టి.వి మీద పెట్టాను'' అన్నం కలుపుకుంటూన్న తల్లికి నేయివేస్తూ అన్నది దీప్తి.

''అలాగా'' రేవతికి కొడుకుని చూడాలనిపించింది. దీప్తి కబుర్లుచెప్తుంటే అన్యమనస్కంగా వింటూ, ఎలాగో భోజనం అయిందనిపించింది.

దీప్తి గుడ్‌నైట్ చెప్పి వెళ్ళిపోయింది.

లైట్ ఆఫ్ చేసి, బెడ్‌లైట్‌వేసి మంచంపై వాలిపోయిన రేవతి, నీలంరంగు వెలుతుర్లో నీలంగా కనిపిస్తోన్న గోడలకేసి, సీలింగ్‌కేసి చూస్తూ ఉండిపోయింది.

గుండెల్లో బరువు - మోయలేని బరువు - రోజురోజుకూ పెరిగే బరువు. ఇది తరిగేది కాదు.

ఇరవై నాలుగ్గంటలూ అనేక వ్యాపకాలతో, ఈ ఆలోచనలని వదిలించుకోవటానికి ప్రయత్నిస్తున్నా - వదలని ఆలోచనలు.

స్త్రీ ఎంత అభ్యుదయం సాధించినా, ఎన్ని రంగాల్లో ప్రగతి సాధించినా, పరస్పరావగాహనతో, పరస్పరానురాగంతో, సామరస్యపూరితమైన దాంపత్య జీవితాన్ని మాత్రం సాధించలేకపోయింది. అడుగడుగునా స్త్రీల ఉన్నతికి అడ్డుపడుతూ, ఆమె స్వాతంత్ర్యాన్ని అణగదొక్కే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు పురుషుడు. స్త్రీ సమాజానికి ఎన్నో విధాలుగా ఉపయోగపడుతూ, సమాజాభివృద్ధికి పాటుపడుతూ కూడా ఈ సమాజంలో ఒకరి భార్యగా తప్ప వ్యక్తిగా ఉన్నతమైన స్థానాన్ని పొందలేకపోతోంది.

వంటరితనం భరించరానిది. కాని మగవాడి అధికారానికి లొంగి, బానిసగా

బతికేకన్నా వంటరితనాన్ని భరించటమే మంచిదికదా?

మనోహర్‌ని అంగీకరించటానికి ఈ సమాజమా? తన బలహీనతా? - ఏది అడ్డొస్తోంది.

మెడికోస్‌గా, ఎంతో సరదాగా హాయిగా చక్కని స్నేహితుల్లా కలిసి తిరిగిన తనూ, ప్రభాకర్ డిగ్రీ చేతికందగానే అందమైన దాంపత్యజీవితాన్ని ఆహ్వానించారు.

కానీ స్నేహితురాలిగా ఉన్నప్పుడు తనలో కనిపించిన అందాలూ, చిలిపితనాలూ, గొప్ప భావాలూ, అత్యున్నతమైన ఆశయాలూ, భార్యగా మారాక ప్రభాకర్‌కి అల్పంగా కనిపించాయి.

రోజొక క్షణంగా గడుస్తుందనుకున్న సాంసారిక జీవితం క్షణమొకయుగంగా గడుపుతూ, మానసికంగా చస్తూ బతకాల్సివచ్చింది.

అయినా ఐదు సంవత్సరాల దాంపత్య జీవితానికి నిదర్శనంగా ఇద్దరు పిల్లల తల్లి అయింది. ప్రభాకర్ మీద ఉన్న అభిమానంతో కొంత, తాళికట్టినవాడన్న గౌరవంతో కొంత, తన పిల్లలకి తండ్రన్న భావంతో కొంత - ఇలా అనేకరకాల బంధాలు తగిలించుకుని, తను రేవతిగాకాక, రేవతీప్రభాకర్‌గా జీవిస్తోంది.

తనకంటూ ఒక ఉనికి లేకుండా కేవలం... కేవలం ప్రభాకర్ భార్యగా ఆరు సంవత్సరాలు జీవించాక ఒక్కసారిగా గుర్తొచ్చింది.

ఇంతకీ తనెవరు? తన ఆదర్శం ఏమిటి? తన గమ్యం ఏమిటి? తన ఉనికి ఎక్కడ? - అన్న సందేహాలు మూకుమ్మడిగా కలిగాయి.

ఒక్కసారిగా మైకంలోంచి తుళ్లిపడి కళ్లు విప్పిన ఆమెకి ప్రభాకర్ తననెలా అణగదొక్కాడో. ఎంత చాకచక్యంగా తనని బానిసని చేసుకున్నాడో బాగా అర్థమైంది.

స్టేట్స్‌కి వెళ్లి పెద్ద సర్జన్ అవ్వాలన్న తండ్రి ఆశయాన్ని గుర్తుచేసుకుందా సమయంలోనే. ఆ విషయం ప్రభాకర్‌తో చర్చించింది రేవతి.

తనకన్నా తన భార్య ఉన్నత విద్యావంతురాలు కావడం ఇష్టంలేని ప్రభాకర్ అందుకు అభ్యంతరం తెలియజేశాడు.

ఫలితంగా ఇద్దరి మధ్యా చర్చలు, వాదాలు, తర్కాలు, స్పర్థలు చోటుచేసుకున్నాయి.

అనురాగంతోకాక అధికారంతో తనని కట్టేయాలనుకుంటున్న భర్త నిరంకుశత్వం రేవతి భరించలేకపోయింది.

తాత్కాలికంగా అతనితో సంబంధం తెంచుకుని స్టేట్స్‌కి వెళ్లిపోయింది.

ఎన్ని ఉత్తరాలు రాసినా, వీసారెడీ చేసినా ప్రభాకర్ పంతం వదల్లేదు, స్టేట్స్‌కి వెళ్ళలేదు.

రేవతి ఇండియా తిరిగివచ్చాక కూడా ప్రభాకర్ ఆమెను కలవలేదు.

ఫలితంగా ఇద్దరూ విడిపోయారు. తన తల్లి దగ్గర పెరిగిన పిల్లల్ని తనే చూసుకుంటూ జీవితంలో ఎన్నో మెట్లు ఎక్కగలిగింది. పెద్ద గైనకాలజిస్ట్‌గా పేరుపొందింది.

సంపాదన పెరిగింది...

స్టేటస్ పెరిగింది...

ఇంటా బైటా గౌరవం... కానీ ఏదో వెలితి, ఏదో కావాలన్న తపన... ఆరాటం. ఆ వెలితి పోగొట్టటానికి ప్రయత్నం చేసినవాడు మనోహర్. కానీ తీవ్రంగా విఫలుడయ్యాడు.

రేవతి మాత్రం కొత్తగా ఏ బంధాన్నీ ఆశించక, ప్రభాకర్‌తో ఉన్న గత అనుబంధానికి గుర్తుగా రేవతీ ప్రభాకర్‌గానే మిగిలిపోయింది. అప్పుడప్పుడు శరీరంలో కలిగే సంచలనం. మనోహర్ మీద ఉన్న మమకారం. బలహీనురాల్ని చేస్తుంటే, మనసుని చంపుకుంటూ, కోరికలను సమాధిచేస్తూ, ఏదో ఒక వ్యాపకం కల్పించుకుంటూ ఉంటోంది.

రేవతి కళ్లు గోడమీద ఉన్న గడియారం వైపు కదిలాయి.

పన్నెండున్నర...

కళ్లనుంచి అశ్రువులు దిండుపైకి జారి ఇంకిపోసాగాయి.

''ప్రభా... ఎందుకిలా నమ్మించి మోసం చేశావు?''

ఆమెకి అలా అప్పుడప్పుడు అనిపించినా, తనలో ప్రభాకర్ మీద అనురాగం గాని, మమకారం గాని ఏ మాత్రం పొంగిపోవటంలేదని బాగా తెలుసు.

మరెందుకు తనీ మిథ్యాప్రపంచంలో, ఆత్మవంచన చేసుకుంటూ బతుకుతోందో అర్థంకావట్లేదు.

రేవతి ఆలోచనలు వదిలించుకోటానికి గట్టిగా కళ్ళు మూసుకుంది.

★ ★ ★

''రేవతీ... రేపు నేను బొంబే వెళుతున్నాను. నువ్వూ రాకూడదూ?''

''లేదు మనూ... రాలేను''

''ఏం... ఎందుకు రాలేవు? ఇలా అస్తమానం పేషంట్సూ, ఇల్లూ, అర్థంపర్థం లేని ఆలోచనల్లో మెకానికల్‌గానే బతుకుతావా?''

''ఒంటరితనానికి బాగా అలవాటుపడిపోయాను మనూ! నలుగుర్లో తిరగాలనే సరదా కాని, ఎక్కడికన్నా వెళ్లి నాలుగురోజులు గడపాలనే కోరికగాని కలగటంలేదు. నా జీవితం రోగులకు...''

''అంకితం చేస్తానంటావు... అంతేగా! రేవతీ... ఇంతకాలంగా చూస్తున్నాను - ఎందుకు నీచుట్టూ ఒంటరితనం అనే కోటగోడ నిర్మించుకుని, అందులో అలా కృశించిపోతున్నావు. ఇంకా ప్రభాకర్ వస్తాడనే ఆశ నీలో ఉందా?''

''లేదు... ఆ ఆశలేదు. రావాలనే కోరిక లేదు. వస్తే ఆహ్వానించే విశాలహృదయం కూడా లేదు. కానీ...'' దీర్ఘంగా నిశ్వసిస్తూ ఆపేసింది.

''ఊఁ... కానీ...'' పరీక్షగా ఆమె మొహంలోకి చూస్తూ అడిగాడు. ''ఏమో! నేనే ఏ ప్రగతిని ఆహ్వానించలేకపోతున్నాను. నా జీవితంలో ఇంకా ఏదో మార్పు రావాలనే ఆశకూడాలేదు. నా మనసేమిటో నాకే అర్థంకావటంలేదు''

''నీ మనసు అర్థం చేసుకుని, నీకేం కావాలో గమనిస్తూ అహర్నిశలూ నిన్ను కనిపెట్టుకుని ఉండాలనుకునే నన్ను, నిన్నందుకోలేని దూరంలో నిలబెట్టావు. మనమధ్య ఈ దూరం ఎప్పటికైనా తరుగుతుందా?'' ఆవేదన మిళితమైన స్వరంతో అడిగాడు.

రేవతి నిట్టూర్చింది. మనోహర్‌ని జీవితంలోకి ఆహ్వానించటానికి తనెందుకింత సంకోచిస్తోందో ఆమెకే అర్థంకావటంలేదు. అతనికేం జవాబియ్యగలదు? డిగ్రీలో రేవతి క్లాస్‌మేట్ మనోహర్. ఆ తరవాత ఆమె ఎమ్.బి.బి. ఎస్‌లో చేరింది. మనోహర్ బిజినెస్‌మాన్‌గా సెటిలయ్యాడు. ప్రభాకర్‌తో జీవితం పంచుకున్నాక కానీ తెలియలేదు, మనోహర్ తనని ప్రేమించాడు అన్న విషయం. కానీ ఏంచేయగలదు? అనుకోకుండా మళ్లీ జీవితంలో ప్రవేశించాడు. కొన్నేళ్ళ తరువాత అనారోగ్యంతో ఉన్న భార్యని తీసుకుని ఆమె డిస్పెన్సరీకి వచ్చాడు. అతని దురదృష్టమో, ఆమె దురదృష్టమో, అతని భార్య పూర్తిగా మంచంపట్టింది. ఆ తరవాత...

ప్రభాకర్‌కి, రేవతికీ రేగిన స్పర్థలూ, రేవతి స్టేట్స్‌కి వెళ్లిపోవటం... తిరిగిరావడం ప్రభాకర్ మరో వివాహం చేసుకోవటం... ఇలాంటి మార్పులన్నీ ప్రత్యక్షంగా చూస్తున్నా కూడా, ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. పరోక్షంగా రేవతికి మాత్రం ఎన్నో విధాలుగా సహాయం చేశాడు. రేవతి స్టేట్స్‌లో ఉన్నప్పుడే మనోహర్ భార్య చనిపోయింది.

మనోహర్ వంటరివాడై పోయాడు.

రేవతి ఒంటరితనం... తన ఒంటరితనంతో మనోహర్ మనసులో వాడిపోయిన ఆశల తీగెలు చిగురించనారంభించాయి. అందుకే అతను నిరాశపడకుండా రేవతిని ఒప్పించాలన్న ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు.

ఇద్దరూ ఒకేసారి వారివారి ఆలోచనల నుంచి తేరుకున్నారు.

''ఏమిటి ఆలోచిస్తున్నావు రేవతీ?'' అడిగాడు.

''ఏమీ లేదు మనూ. ఈ ద్వైదీభావంతో ఊగిసలాడే నా మనసుకి ఈ జన్మలో శాంతి లభిస్తుందా? అని భయంగా ఉంది''

''మనసు మనం ఎలా కావాలనుకుంటే అలా మార్చుకోవచ్చు రేవతీ. ఏమీ ఆలోచించకుండా నా చేయందుకుని మళ్లీ జీవించడం ప్రారంభించు''

''మనూ! నాకు తెలుసు. సొసైటీ ఎంతో మారిపోయింది. స్త్రీలు పునర్వివాహం చేసుకోవటం మామూలైపోయింది. సమాజం కూడా అలాంటివారిని పట్టించుకోవటం మానేసింది. కానీ, ఇద్దరు పిల్లల తల్లిని నాకు మళ్లీ పెళ్లేమిటనే న్యూనతాభావం నాలో నిండిపోయి నేను అందుకు సాహసించలేకపోతున్నాను. అంతేకాదు స్నేహితుడిగా, ఆత్మీయుడిగా నిండుమనసుతో నాకు సహాయం చేసిన నిన్ను నేను వలలో వేసుకుని, నీకోసమే ఆయనకి దూరమైనానని నలుగురూ అనుకుంటారేమోనని భయం వేస్తోంది''

''పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు, నలుగురూ ఎవరు అనుకోటానికి? నువ్వు కష్టాల్లో ఉన్నప్పుడు ఆ నలుగురూ వచ్చి సాయంచేశారా? నీ భర్త నిన్ను మర్చిపోయో, నిర్లక్ష్యం చేసో వేరే పెళ్లిచేసుకుంటుంటే ఆ నలుగురు ఆపలేదేం? నీకే ఏదో అనుమానం అంతే అందుకే నన్ను తిరస్కరిస్తున్నావు''

రేవతి బాధగాచూసింది.

''మనూ! నువ్వు నన్నెంతగా కోరుకున్నావో, నాకోసం ఎంతకాలంనుంచి

ఎదురుచూస్తున్నావో నాకు తెలుసు. కాని... తరతరాలుగా నా రక్తంలో కలిసిపోయిన మూఢాచారాలే కావచ్చు. సంకోచం కావచ్చు, భయం కావచ్చు, ఏదైనా నన్ను ముందుకి నడిపించలేకపోతున్నాయి. సాహసంతో ఏమీ చేయలేకపోతున్నాను''

''కానీ ఒక్కమాట మనస్ఫూర్తిగా చెప్పు. నీ పిరికితనానికి నువ్విప్పుడు బాధపడటం లేదా? నువ్వు జీవితంలో ఏంపోగొట్టుకున్నావో నీకు అర్థం కాలేదా!''

రేవతి మాట్లాడలేదు.

''రేవతీ! జీవితంలో సగభాగం గడిచిపోయింది. దీప్తికి పెళ్ళిచేస్తే వెళ్ళిపోతుంది. శరత్ పెద్దవాడవుతున్నాడు. పిల్లలు పెద్దవాళ్ళవనంతవరకే తల్లి, తండ్రి బంధాలూ, అనుబంధాలూ - రెక్కలొచ్చాక ప్రతిపక్షి గూడు వెతుక్కునే ప్రయత్నం చేస్తుంది. అప్పుడు నీ ఈ వంటరితనం నిన్నెంత చిత్రవధ చేస్తుందో తెలుసా?''

రేవతి నవ్వింది - ''తెలిస్తే ఏంచేయగలను?''

''ఏవన్నా చేయవచ్చు, నీకేం వయసు మించిపోయిందని? ఎందుకిలా వైరాగ్యంగా మాట్లాడుతున్నావు?''

''వైరాగ్యం ఏం ఉంది? నాకిప్పుడు అలాంటి ఉద్దేశం మాత్రంలేదు. ఎప్పుడన్నా అలాంటి ఉద్దేశం కలిగితే నీకే చెప్తాను. నన్నెంతో అభిమానించే నీ సాంగత్యం కన్నా నాకేం కావాలి?''

మనోహర్ ఆ కాస్త మాటకే పొంగిపోయాడు. రేవతికి తనంటే ఇష్టం ఉంది అన్న భావన చాలు అతనికి ఎంతో తృప్తిగా ఉంటుంది.

''సరే... నేను బహుశా ఓ నెలరోజుల్లో వస్తాను. లేకపోతే అక్కణ్ణించి అటే స్టేట్స్‌కి వెళ్ళిపోతాను. ఈ నెలరోజుల్లో నీ మనసు మారితే, నాకు లెటర్ రాస్తావా?''

మనోహర్ అలా ఆవేదనగా మాట్లాడుతోంటే, రేవతికి దుఃఖం ఆగలేదు. మొహం తిప్పేసుకుని తల ఊపింది.

మనోహర్ ఒక్కసారి ఆమె వైపు చూసి, నెమ్మదిగా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

వారంరోజుల తర్వాత ఒకరోజు ఓ ఇరవైఅయిదేళ్ల అమ్మాయి వచ్చింది.

రేవతి హాస్పిటల్‌కి వెళ్లడానికి ఉద్యుక్తురాలవుతోంది. ఆ అమ్మాయి నెమ్మదిగా, కొంచెం మొహమాటంగా ఐనా నిర్భయంగా అన్నది - ''డాక్టర్! నేను మీతో పర్సనల్‌గా మాట్లాడాలి''

రేవతి కొద్దిగా సందేహించి - '' హాస్పిటల్‌కి రామ్మా...'' అన్నది.

''లేదు డాక్టర్ - ఒక్క పదినిముషాలు చాలు. ఇక్కడే మాట్లాడాలి... ప్లీజ్...'' అన్నది.

కొంచెం ఆలోచించి - ''సరే - రా...'' అంటూ లోపలికి దారితీసింది రేవతి.

''కూర్చోమ్మా... ఏమిటి నీ ప్రాబ్లెమ్?''

ఆ అమ్మాయి కొన్నిక్షణాలు మాట్లాడలేదు.

తరువాత మెల్లిగా అన్నది - ''నా పేరు సౌందర్య... నాకు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. కానీ, మా అభిప్రాయాలు కలవక ఏడాది కాకుండానే విడిపోయాం. నాకు పిల్లలు లేరు. సంవత్సరం నుంచి విడిగానే ఉంటున్నాను. ఎప్పుడూ ఇలా జరగలేదు కానీ...''

''ఊఁ.... కానీ...'' రేవతి పరీక్షగా చూస్తూ అడిగింది.

''రెండునెలలక్రితం నేను అనుకోకుండా నా బాయ్‌ఫ్రెండుతో కమిట్ అయ్యాను. జరిగిందానికి పడే బాధకన్నా జరగబోయేదేమిటో అని భయంగా ఉంది. పైగా, ఈ నెల...'' ఆగిపోయింది.

''అనుమానంగా ఉందా?'' రేవతి ప్రశ్నకి ఔనన్నట్లుగా తల ఊపింది.

అంత నిస్సంకోచంగా, నిర్భయంగా చెప్తోన్న ఆ పిల్లని చూస్తే రేవతికి ఆశ్చర్యం వేసింది.

ఆమెలో తప్పు చేశానన్న భావనకన్నా, ప్రెగ్నెన్సీ వస్తుందన్న భయం ఎక్కువగా ఉంది.

''నీకు దిగులుగా, బాధగా లేదా?'' అడిగింది.

నవ్వింది సౌందర్య - '' ఎందుకు డాక్టర్? కావాలని చేసిన పనికి బాధెందుకు, దిగులెందుకు?''

''తెలిసీ తప్పెందుకు చేశావు?''

''తప్పుకాదని తెలిసి చేశాను. ఏమీ జరగనంతవరకు తప్పుకాదు. ఏదన్నా జరిగితే తప్పు. ఆ తప్పు ఏదంటే నాకే రక్షణ లేని ఈ సమాజంలోకి మరో

ప్రాణిని తెచ్చిన తప్పు. ఆ తప్పు చేయకూడదనే మీ దగ్గరికి వచ్చాను''

''నువ్వు చేసింది తప్పుకాదని అనుకుంటున్నావా?'' రేవతికెందుకో ఆ అమ్మాయిని మాట్లాడించాలి అనిపించింది.

''కాదు - ముమ్మాటికీకాదు. అందమైన భార్యని నేనుండగా, నాభర్త పరాయి ఆడవాళ్ల దగ్గర డబ్బిచ్చి సుఖం ఎందుకు కొనుక్కోవాలి? పువ్వుల్లా పెంచి తమకి ధారాదత్తంచేసిన ఆడపిల్లలను మగవాళ్లు ఎంత జాగ్రత్తగా, అపురూపంగా చూసుకోవాలి? కానీ అనుమానంతోటి, సాధింపుతోటి, అహంకారంతోటి భార్యని కేవలం బానిసగాచూస్తూ ఆమెకి ఒక వ్యక్తిత్వం ఉంటుందనీ, ఆమెకంటూ కొన్ని అభిప్రాయాలూ, ఆశలూ ఉంటాయనీ, వాటిని గౌరవించి, సహకరించాలనీ అనుకోకుండా నన్ను కేవలం పనిమనిషిగా, వాళ్లింట్లో ఓ మిషన్‌లా ఉపయోగించుకున్నాడు నా భర్త. అలాంటి వాడికోసం నేను ఏడుస్తూ జీవితం అంతా మోడులా గడపాలా?''

''కానీ - నీతి నిజాయితీ మర్చిపోతే ఎలా? ఆడపిల్లవి. నీకు ప్రకృతి కొన్ని నిబంధనలు పెట్టింది. వాటిని అతిక్రమిస్తే ఎలా?''

''ప్రకృతి పెట్టిన నిబంధనలనుండి కాపాడుకునే తెలివితేటలు, అవకాశం కూడా మనకున్నాయిగా డాక్టర్! నేనిలా మారడానికి కారణం ఆయనే. అవును... ఒక స్త్రీ దారితప్పిందంటే అందులో మగవాడిదే బాధ్యత - అంతాకాకపోయినా డెబ్బై ఐదుశాతం అతను అసమర్థుడు, నీచుడు కాబట్టి భార్య అతని సాంగత్యంనుంచి తప్పుకుంటుంది. స్త్రీ, సరైన దారిలో నడవాలంటే ఆమె చేయందుకుని నడిపించేవాళ్లు కూడా ఉండాలిగా''

ఇచ్చినాసరే దారితప్పకుండా, ఏ ఆధారం లేకపోయినా, సక్రమమైన దారిలో నడిచి గమ్యాన్ని చేరి గర్వంగా తలెత్తుకుని ప్రవర్తించడమే మనం ఎంతో శ్రమించి, పోరాడి, సాధించుకున్న స్వేచ్ఛకి, స్వతంత్రానికి విలువ''

''కావచ్చు - కానీ ఆ విలువ ఎప్పుడో తెలుసా? ఆమె తన ఉపాధికి వ్యభిచారిణిగా, దొంగగా మారకుండా నీతిగా, న్యాయంగా, హుందాగా బతుకు సాగించడంలో. అంతేకాని కోరికలు చంపుకుంటూ, మోడులా జీవించటంలో కాదు. నేను ఉప్పూ కారం తింటున్నాను.

యవ్వనంలో ఉన్నాను. కోరికలున్నాయి. ప్రేమించే హృదయం ఉంది. నేనేం స్పందనలేని బండరాయినికాదే. ఎందుకు మడికట్టుకు కూర్చోవాలి?

అయినా ఎవరో ఏదో అనుకుంటారనో. ఏదో జరుగుతుందనో, పాపం అనో, అనుకుంటూ దానికి నీతి, పవిత్రత అనే పేర్లు పెట్టి మనల్ని మనమే వంభ్యపెట్టుకోటం ఎందుకు? మనసులో అలాచేయాలని అందరికీ అనిపిస్తుందేమోనని అనిపిస్తుంది నాకు. నిజంగా మనసులో అలాంటి కోరిక కలగటం పాపంకాని, తప్పుకాని కాదని నమ్మాలి. ఆఫ్టరాల్... సెక్స్ ఈజ్ ఏ మాటర్ ఆఫ్ ఫ్యాక్ట్. ఆకలేస్తే అన్నంతినటం ఎంత సహజమో, కోరిక కలిగిన వెంటనే తీర్చుకునే అవకాశం ఉన్నప్పుడు తీర్చుకోవటం కూడా అంతే సహజంగా భావిస్తే ఎంత బాగుంటుంది?''

''ఇంత విపరీతమైన భావాలు మంచివికాదు సౌందర్యా''

''ఎవరికి... ఎవరికి మంచివికావని మీరు భావిస్తున్నారు?''

''స్త్రీ ఇలాంటి భావాలు కలిగి వుండటం సమాజానికి హానికరం''

''హు - సమాజం... సమాజం అంటే ఎవరు? కొందరు సౌందర్యలు, మరికొందరు రేవతులు, కొందరు వృద్ధకన్యలు - మరికొందరు మధ్యతరగతి మందభాగ్యులు, ఇంకా కొందరు స్వార్థపరులు, మోసగాళ్ళు, దురాశాపరులు - ఇలా అనేకరకాలైన మనుషులతో నిండినదే కదా!

డాక్టర్... కట్నం ఇవ్వలేని ఆడపిల్లకి పెళ్ళికాకపోతే, 'అయ్యో! ఏమిటి ఈ వ్యవస్థ' అని సమాజం ఏంబాధ్యత వహించింది? దురదృష్టవశాత్తూ విధివంచితలైన స్త్రీలను అనుభవించటానికి ఆరాటపడినంతగా, ఉద్ధరించటానికి ముందుకురాని మగవాళ్ళని ఈ సమాజం ఏంచేయగలిగింది? వాళ్ళ స్వార్థంకోసం, వాళ్ళ సుఖంకోసం, భోగంకోసం, స్త్రీలని వేశ్యలుగా మార్చి నడిబజారులో వేలం వేసినప్పుడు ఈ సమాజం ఎంత ఆదుకోగలిగింది వాళ్ళని? ఏ స్త్రీని అయితే పెళ్ళిచేసుకోటానికి హిరణ్యాక్షవరాలడిగి, డబ్బుకోసం రక్తం పిండుతారో, అదే స్త్రీని వేశ్యాగృహంలో డబ్బిచ్చి కొనుక్కుంటారు. కారణం ఒకరాత్రి సుఖంకోసం తప్ప బాధ్యత మోయనవసరంలేదు కాబట్టి. కేవలం శారీరకసుఖంకోసం ఆడపిల్లలని పొగిడి, వాళ్ళకోసం పిచ్చికుక్కల్లా తిరిగే మగవాళ్ళున్నప్పుడు వాళ్ళని ఎలా ఉపయోగించుకోవాలో తెలిసిన ఆడవాళ్ళు ఉండాలిగా''

రేవతికి మతిపోయింది. ఒక పాతికేళ్ళ ఆడపిల్లలో ఈ భావాలు పెరిగిపోతే ఈ సమాజంతీరు ఏంకావాలి? తరతరాలుగా కాపాడబడుతూ వస్తోన్న

నైతిక విలువలు, పవిత్రత, వివాహవ్యవస్థపట్ల నమ్మకం, కుటుంబవ్యవస్థ - ఇవన్నీ... ఇవన్నీ ఏంకావాలి?

''సౌందర్యా... ఆడవాళ్ళంతా మగవాళ్ళలా ప్రవర్తిస్తే వివాహవ్యవస్థకి అర్థమేమిటి?''

''సమాజం పునాదులు మన జీవితాలమీద ఆధారపడి ఉన్నాయా డాక్టర్? ఈ సమాజం పటిష్టంగా ఉండాలంటే బాధ్యత కేవలం స్త్రీయే వహించాలా?''

''అదికాదమ్మా... స్త్రీ శారీరకంగా బలహీనురాలైనా, మానసికంగా బుద్ధిబలం కలిగి ఉంది. సహనం, శాంతం, ఓర్పు, నేర్పు, తెలివితేటలు అన్నీ స్త్రీలో ఉన్నాయికాబట్టే ఇంత గురుతరమైన బాధ్యత స్త్రీకి అంటగట్టారు''

''లేదు డాక్టర్ - అలా అని మనల్ని వంచించి, పిచ్చివాళ్లనిచేసి ఆడుకున్నారు అందరూ. 'నువ్వు మంచిదానివి. సహనవంతురాలివి...' అని పొగిడి ఆ ప్రభంజనంలో మన అస్థిత్వాన్ని సమాధిచేసి, చాకచక్యంగా మనలను బానిసలు చేసుకున్నారు ఈ మగవాళ్ళు''

రేవతికి ప్రభాకర్ గుర్తొచ్చాడు. అంతే... సౌందర్య చెప్పింది అక్షరాలా నిజం.

''సౌందర్యా - బాగా చెప్పావమ్మా...'' మనస్ఫూర్తిగా అన్నది.

సౌందర్య కళ్లు మెరిశాయి. నెమ్మదిగా అన్నది - ''డాక్టర్! మీరు ఏమీ అనుకోకపోతే ఒకమాట''

''మీరు... మీరు - ఒంటరిగానే ఉంటున్నారని, మీవారితో విడిపోయారని విన్నాను. కానీ మీ నేమ్‌ప్లేట్ మీద రేవతీప్రభాకర్ అని ఉంది. మీ మెళ్లో మంగళసూత్రాలు, నల్లపూసలు, కాళ్లకి మట్టెలు - వీటన్నిటికి కారణం?''

రేవతి మాట్లాడలేదు. కారణం ఆమెకి తెలిస్తేగా చెప్పటానికి నిశ్శబ్దంగా ఉండిపోయింది.

''చెప్పండి డాక్టర్... కాస్సేపు వయస్సు, వావి మర్చిపోయి ఫ్రెండ్లీగా మాట్లాడుకుందాం చెప్పండి''

రేవతి నిట్టూర్చింది.

''మేము లీగల్‌గా డైవోర్స్ తీసుకోలేదు. కానీ మేం విడిపోయి పదిహేనేళ్లు అయింది. మధ్యలో రెండేసార్లు కలిశాను. అది కూడా నేనే స్టేట్స్ నుంచి

వచ్చాక వెళ్లిబతిమాలాను. కానీ ఆయన రాలేదు. చూస్తూ చూస్తూ ఇవన్నీ తీయలేకపోయాను. ఆయన - ఎక్కడోఅక్కడ క్షేమంగా ఉన్నారుకదా!''

''ఆయన అలాగే వంటరిగా ఉన్నారా?''

''లేదు... పెళ్లిచేసుకున్నారు''

''మరి మీరు ఊరుకున్నారా?''

''ఊరుకోకచేసేదేముంది? అల్లరిపడటం తప్ప''

''చూశారా - మీకు తెలీకుండా మీలో సంకుచిత భావాలు, సంప్రదాయాలపట్ల గౌరవం, ఈ అర్థంలేని సంస్కృతిపట్ల నమ్మకం ఏర్పడ్డాయి. అందుకే ఫారిన్‌రిటర్న్డ్ అయినా మంగళసూత్రాలు అవీ పెట్టుకుని అటులోకాన్ని, ఇటు మిమ్మల్ని వంచించుకుంటూ జీవిస్తున్నారు. మరెవరి భర్తగానో జీవిస్తున్న ఆయనకోసం, మీరు బాధ పడుతున్నారు. ఆయన క్షేమంకోసం మీరిలా మంగళసూత్రాలు, పసుపుకుంకుమలు ధరిస్తూ తమాషాగా జీవిస్తున్నారు. మీరివన్నీ తీసేస్తే ఆయనకి ఏమన్నా జరుగుతుందని మీ భావమా? అలా అయితే ఆయన భార్యగా ఆవిడకూడా ఇవన్నీ ధరిస్తూ తన ముత్తైదువతనంతో ఆయనకి ఆయుష్షుపోస్తున్నాననే భ్రాంతిలో జీవిస్తుండవచ్చు కూడా కదా! హు - ఒక మగవాడికోసం ఇద్దరు ఆడవాళ్లు వాళ్ళ పవిత్రతని పెట్టుబడిగా పెట్టి అతనికి అన్నిరకాల సుఖాలను అందచేస్తున్నారు. ద్వేషించాల్సినవాడిని గౌరవిస్తున్నారు. నాశనంకోరుకోవాల్సినవాడి ఆయుష్షు కోరుతున్నారు. ఇంతకన్నా ట్రాజడీ ఉందా మన జీవితాల్లో?''

ఇంత చదువుకున్న మీరు మీకంటూ ఒక ఉనికి, వ్యక్తిత్వం లేకుండా, ప్రభాకర్ మనిషిగా జీవిస్తున్నారు. నిజానికి మీ మనసులో ప్రభాకర్ రూపం చెరిగిపోయింది. కానీ పరాయివాళ్ల ఆలోచనలు రాగానే మీలో మీరు తుళ్లిపడి, బలవంతంగా ప్రభాకర్‌ని గుర్తుచేసుకుంటున్నారు. భర్తని వదిలేశానని చెప్తే ఈ సమాజం విమర్శిస్తుందని, గౌరవం ఇవ్వదనీ భర్త స్టేటస్‌లో ఉన్నారని చెప్తున్నారు. అటువంటి మనిషిని వదిలేసి ఎంత చక్కగా, స్వతంత్రంగా బతుకుతున్నానో చూశారా?- అని గర్వంగా ఎందుకు చెప్పలేకపోతున్నారు? ఇదే - మనలో చాలామంది స్త్రీలలో ఉన్న బలహీనత.

''ఓ పక్క భర్తని అసహ్యించుకుంటూ, అనుమానిస్తూ మళ్ళీ అతన్ని

గుప్పిట్లో పెట్టుకోవాలని ప్రయత్నిస్తుంటారు. భర్తని ఒక స్నేహితుడుగా, సహచరుడుగాకాక స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. ఈ దిక్కుమాలిన సమాజం మగవాడితోడులేని ఆడదాన్ని చులకనగా చూడబట్టే స్త్రీలంతా ఇలా ఆత్మవంచనతో జీవిస్తున్నారు. కానీ చదువు సంస్కారం పుష్కలంగా వున్న మనం ఆ దారిలో నడవకూడదు. మగవాడు ఆడదాన్ని సెక్స్‌సింబల్‌గా చూస్తున్నాడు. ఆడది మగవాడిని స్టేటస్ సింబల్‌గా భావిస్తోంది.

ఓహ్... ఏం వ్యవస్థ మనది? ఎంత గొప్ప మాంగల్యబంధాలివి?

ఎందుకొచ్చిన దాగుడుమూతలు ఈ జీవితాలతో?''

''నువ్వు చెప్పినవన్నీ నిజమే కావచ్చు - కానీ, మగవాడితో సమానంగా స్త్రీలు కూడా విచ్చలవిడిగా బతికితే నాగరికతకి అర్థం ఏవిటి? ఆదిమానవుడిలా వావివరసలు లేని సమాజం ఏర్పడదా?''

''డాక్టర్!'' నవ్వింది సౌందర్య.

''నాగరికత ముసుగులో మనిషి ఆదిమానవుడికన్నా హీనంగా బతుకుతున్నాడు. అవే చీకటి బతుకులు. చీకట్లో జరిగే నేరాలు, ఘోరాలూ - ఏ ఆదిమానవుడూ చేసినట్టు చదవలేదు నేను''

''ఏమైనా ఇలా తరచూ అబార్షన్స్ చేయించుకోటం ఆరోగ్యానిక్కూడా మంచిది కాదు''

''అలా అన్నారు బాగుంది. ఇంకెప్పుడూ బహుశా ఈ అవసరం రాకపోవచ్చు ఎందుకంటే నేను వివాహంచేసుకోబోతున్నాను''

''అలాగా! మరి ఇప్పటిదాకా -''

''ఇప్పటిదాకా సంప్రదాయం ముసుగులో మనం బతికే ఒక చవకబారు జీవనవిధానాన్ని విమర్శించాను. కాని భావాలు, అభిప్రాయాలూ ఏకమై, అనురాగాలు పంచుకునే స్త్రీ పురుషులు వివాహం అనే బంధంతో జీవితాంతం కలిసి ఉండటాన్ని నేను విమర్శించలేదు.

ఎప్పుడో విడిపోయిన భర్త అనే పురుషుడి మీద, ఇంకా అభిమానం ఉందనే భ్రమతో జీవించవద్దని మిమ్మల్నీ, మీలాంటి స్త్రీలనీ కోరటమే నా ఉద్దేశం. మనసున్నవాడు, మనసైనవాడు, మిమ్మల్ని అర్థంచేసుకున్నవాడు లభిస్తే ఇప్పటికైనా మించిపోయిందిలేదు. మీరు వి-'' అర్థాంతరంగా ఆగిపోయి అన్నది సౌందర్య- ''సారీ డాక్టర్... మీ పర్సనల్ విషయాలు మాట్లాడమేకాక

పొరపాటుగా మాట్లాడితే క్షమించండి''

రేవతి ఉలిక్కిపడింది. మనోహర్ మదిలో మెదిలాడు.

తనకే అర్థంకాని తన మనోభావాలను ఎంత చక్కగా విడమర్చి చెప్పింది సౌందర్య.

నిజంగా ఇన్నాళ్ళూ తనలో హిపోక్రసీ పేరుకుని ఉందా?

నటనతో లోకాన్ని మోసంచేస్తూ, ఏదో ఒక భ్రమలో జీవించిందా తనిన్నాళ్ళూ?

రేవతికి తలతిరుగుతున్నట్లుగా ఉంది. సౌందర్య రేపిన అల్లకల్లోలంతో ఆమె మనసులో తుఫాను రేగినట్లైంది.

రేవతి పరిస్థితి గమనించిన సౌందర్య, ఆవిడ ప్రస్తుతం తనని పరీక్షించే మూడ్‌లోలేదని గ్రహించి, నెమ్మదిగా లేచి - ''రేపు రమ్మంటారా డాక్టర్?'' అని అడిగింది.

ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అవుతూన్న రేవతి అన్యమనస్కంగా తలవూపింది.

ఒంటరిగా మిగిలిపోయిన రేవతికి మొదటి సారిగా తను పోగొట్టుకున్నదేవిటో తెలుస్తోంది.

ప్రభాకర్ హాయిగా ఉన్నాడు, భార్యా పిల్లలతో

తనేమో ఇన్నేళ్ళనుంచి, జీవచ్ఛవంలా కోరికలకు బలవంతంగా సమాధికట్టి శిలలా బతికింది.

ఎన్నిసార్లు మనోహర్ చేతుల్లో కరిగిపోవాలని, అతని హృదయంపైన తలవాల్చి ప్రశాంతంగా నిద్రపోవాలని తహతహలాడలేదూ తన మనసూ, శరీరం?

మనోహర్ ఎంత మంచివాడు! ఎంత సహనంతో తనకోసం ఎదురుచూస్తున్నాడు.

ఎంత ఆరాధన! ఎంత ప్రేమ! ప్రేమించే హృదయం ఉన్నవాడు, సహృదయుడు అయితే చాలు - ప్రేమించటానికి అర్హత కావాలా?

సౌందర్య మాటలు చెవుల్లో మారుమోగుతున్నాయి.

ప్రభాకర్ జ్ఞాపకాలపుటలు చకచకా తరిగిపోతున్నాయి. మనసులో మనోహర్‌కి తనమీదున్న అభిమానం కొలవటానికి తనవద్ద ఏ కొలబద్దలేదే!

ఆమె మనసులో ఘర్షణ - ఘర్షణ. నెమ్మదిగా అలాగే సోఫాలో వాలిపోయింది. వెనక్కి జారి, మెడని చుట్టుకుని, పక్కకిపడ్డ మంగళసూత్రాలు కనిపించాయి.

వేదమంత్రాల మధ్య - సన్నాయి వాయిద్యాలమధ్య - ముత్తైదువుల దీవనలమధ్య - ధర్మేచ - కామేచ - మోక్షేచ - నాతిచరామి - అంటూ మూడుముళ్లు వేసిన ప్రభాకర్- పెళ్ళిపందిరి- అన్నీ ఒక్కసారిగా కళ్ళముందు మెదిలాయి.

విరక్తితో కూడిన చిరునవ్వు, ఆమె పెదాల పైన లాస్యం చేసింది.

ఆమె చేతులు నెమ్మదిగా మంగళసూత్రాలను మెడనుంచి తొలగించాయి.

ఒక్కసారి వాటి వైపుచూసింది. వీటివెల బహుశా అయిదారు వేలు ఉండవచ్చు-

నవ్వుకుని- చేతికందుబాటులో ఉన్న టీపాయ్ మీద పెట్టింది.

మంగళసూత్రాలు- లైసెన్స్- వీటికి పవిత్రత లేదు.

టీపాయ్‌మీద ఉన్న ఫోన్‌పైన ఆమె చేతివేళ్లు, నెమ్మదిగా మనోహర్ నంబర్‌కు డయల్‌చేయసాగాయి.

విపులలో ప్రచురితం